క్లుప్తంగా

ఓటు హక్కుపై అవగాహన



వాల్‌పెయింటింగ్‌ను పరిశీలిస్తున్న ఆర్‌ఓ అశోక్‌చక్రవర్తి

సత్తుపల్లిటౌన్‌: ఓటు హక్కుపై ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని సత్తుపల్లి ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి అశోక్‌చక్రవర్తి అన్నారు. ఆదివారం సత్తుపల్లిలోని ప్రభుత్వ కార్యాలయాల గోడలపై బాలుర పాఠశాల విద్యార్థులు, జేవీఆర్‌ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, కళాకృతి విద్యార్థులు ఓటు ప్రాధాన్యతను వివరిస్తూ వేసిన వాల్‌పెయింటింగ్స్‌ను పరిశీలించారు. చిత్రకారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఆర్‌ఓ యోగీశ్వరరావు, ఆర్‌ఐ నరేష్‌ పాల్గొన్నారు.

ప్రజాపంథా సత్తుపల్లి అభ్యర్థిగా లాజరు



బీరెల్లి లాజరు

సత్తుపల్లి: అసెంబ్లీ ఎన్నికల్లో సీపీఐ(ఎంఎల్‌) ప్రజాపంథా సత్తుపల్లి నియోజకవర్గ అభ్యర్థిగా బీరెల్లి లాజరును ప్రకటించింది. పెనుబల్లి మడలం లింగగూడెంలో పేద రైతు కుటుంబంలో జన్మించిన ఆయన పెనుబల్లిలో పదో తరగతి వరకు, కల్లూరులో ఇంటర్‌ పూర్తిచేశారు. కళాశాలలో విద్యార్థిగా పీడీఎస్‌యూ కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొన్న లాజరు 2000తర్వాత సీపీఐ(ఎంఎల్‌) ప్రజా పంథాలో చేరారు. ఆయన వయస్సు 58ఏళ్లు కాగా, పెనుబల్లి మండలం చౌడవరం, లింగగూడెంల్లో పోడు పోరాటల్లో క్రియాశీలకంగా పాల్గొన్నారు. అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీ జిల్లా కమిటీ సభ్యుడుగా కొనసాగుతూ ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొంటున్నారు. కాగా, లాజరుకు భార్యతోపాటు ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

అమరవీరుల బాటలో నడుద్దాం



మాట్లాడుతున్న సీవై పుల్లయ్య

కొణిజర్ల: భారత విప్లవోద్యమంలో ప్రాణాలు కోల్పోయిన మహనీయుల బాటలో నేటి యువత నడవాలని ప్రజాపంథా జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సీవై పుల్లయ్య అన్నారు. మండలంలోని రామనరసయ్యనగర్‌లో ఆదివారం గ్రామ శాఖ కార్యదర్శి గుగులోత్‌ సుక్కు అధ్యక్షతన అమరవీరుల వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్‌ పార్టీ బీజేపీకి జూనియర్‌ భాగస్వామిగా మారిందన్నారు. కార్యక్రమంలో పార్టీ డివిజన్‌ కార్యదర్శి అప్పారావు, మండల కార్యదర్శి సీతారాములు, అరుణోదయ జిల్లా కార్యదర్శి లక్ష్మణ్‌, లక్ష్మీనారాయణ, సుభద్ర, రామారావు, రామకృష్ణ, శ్రీను, అనీల్‌, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

తూము వెంకటేశ్వరరావుకు నివాళి



మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న సూరంపల్లి రామారావు, నాయకులు

కొణిజర్ల: వైరా మండలం కేజీ సిరిపురానికి చెందిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు తూము వెంకటేశ్వరరావు మృతికి సీనియర్‌ కాంగ్రెస్‌ నాయకుడు ఎల్‌డీఎం ఖమ్మం పార్లమెంట్‌ కన్వీనర్‌ సూరంపల్లి రామారావు నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట మండల కాంగ్రెస్‌ నాయకులు ఉన్నారు.


విరాట్‌ కోహ్లీ జన్మదిన వేడుకలు

బోనకల్‌: మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో విరాట్‌ కోహ్లీ జన్మదిన వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. కేక్‌ కట్‌ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. విరాట్‌ కోహ్లీ మరెన్నో సెంచరీలు చేసి రికార్డులు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు కిన్నెర నాగరాజు, చాపలమడుగు వర్ధన్‌, కుక్కల రాజేష్‌ తదితరులు పాల్గొన్నారు.

గతంలో ఘన విజయాలు

- మధిరలో సత్తా చాటిన సీపీఎం
- 1985, 1989, 1994లో బోడెపూడి హ్యాట్రిక్‌ గెలుపు
- రెండు ఉప ఎన్నికలు సహా ఐదు సార్లు విజయం
- ఈసారి మళ్లీ బరిలోకి దిగుతున్న సీపీఎం అభ్యర్థి





మధిర: కాంగ్రెస్‌తో పొత్తు లెక్కలు తేలకపోవడంతో ఈ ఎన్నికల్లో సీపీఎం పార్టీ ఒంటరిగానే బరిలోకి దిగాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా 17 స్థానాల్లో పోటీ చేసేందుకు సన్నద్ధం కాగా.. 14 స్థానాలకు అభ్యర్థులను ఆదివారం పార్టీ రాష్ట్ర నాయకత్వం ప్రకటించింది. ఇందులో ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి ఏడు స్థానాలు ఉండగా.. మధిర అభ్యర్థిగా సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్న పాలడుగు భాస్కర్‌ పేరు ఖరారు చేశారు. అయితే, గతంలో సీపీఎం పార్టీకి ఖమ్మం జిల్లాలోనే మధిర నియోజకవర్గం కంచుకోటగా ఉండేది. ప్రస్తుతం ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యాన నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై కథనం.

1983లో తొలిసారిగా పోటీ..

మధిర అసెంబ్లీ నియోజకవర్గం తొలినాళ్లలో జనరల్‌ స్థానం ఉండేది. ఇక్కడి నుంచి మొదటిసారిగా 1983లో సీపీఎం అభ్యర్థిగా బోడెపుడి వెంకటేశ్వరరావు పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఆయనపై కాంగ్రెస్‌ అభ్యర్థి శీలం సిద్దారెడ్డి 11,187 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. ఆ తర్వాత 1985లో సీపీఎం, కాంగ్రెస్‌ నుంచి వీరిద్దరు మళ్లీ పోటీ చేయగా బోడెపుడి 9,068 ఓట్లతో విజయం సాధించి తొలిసారిగా మధిర గడ్డపై ఎర్రజెండా ఎగరవేశారు. ఇక 1989లో మళ్లీ ఇరువురు అభ్యర్థులు తలపడగా సిద్దారెడ్డిపై వెంకటేశ్వరరావు 7,027 ఓట్లతో గెలుపొందారు. 1994లో మూడోసారి ఆయా పార్టీల నుంచి మళ్లీ వీరిద్దరే పోటీ చేయగా బోడెపుడి 9,161 ఓట్లతో మూడోసారి గెలిచి హ్యాట్రిక్‌ నమోదుచేశారు. కాగా, 1998లో బోడెపుడి వెంకటేశ్వరరావు అకాల మరణం చెందగా మధిర నియోజకవర్గంలో ఉప ఎన్నిక జరిగింది. ఆ ఎన్నికల్లో సీపీఎం నుంచి కట్టా వెంకటనరసయ్య పోటీ చేసి కాంగ్రెస్‌ అభ్యర్థి శీలం సిద్దారెడ్డిపై 4,020 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. అలా సీపీఎం మధిర నియోజకవర్గంలో వరుసగా నాలుగు సార్లు గెలిచినట్లయింది. 1999లో సార్వత్రిక ఎన్నికలు జరగగా సీపీఎం అభ్యర్థి కట్టా వెంకటనరసయ్యపై టీడీపీ అభ్యర్థి కొండబాల కోటేశ్వరరావు 5,001 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. కానీ 2004 ఎన్నికల్లో సీపీఎం నుంచి పోటీ చేసిన వెంకటనరసయ్య.. కొండబాలపై 21,443 ఓట్ల భారీ మెజార్టీతో విజయం సాధించడం విశేషం.

రిజర్వ్‌ అయ్యాక దక్కని విజయం..

2009లో నియోజకవర్గాల పునర్విభజనతో మధిర నియోజకవర్గాన్ని ఎస్సీకి రిజర్వ్‌ చేశారు. ఈ ఎన్నికల్లో సీపీఎం నుంచి పోటీ చేసిన లింగాల కమల్‌ రాజ్‌పై కాంగ్రెస్‌ అభ్యర్థి మల్లు భట్టి విక్రమార్క 1,417 ఓట్ల స్వల్ప మెజార్టీతో గెలుపొందారు. 2014లో సీపీఎం నుంచి రెండోసారి కమల్‌ రాజ్‌ పోటీ చేస్తే, కాంగ్రెస్‌ నుంచి బరిలోకి దిగిన భట్టి విక్రమార్క 12,468 ఓట్లతో రెండోసారి విజయం సాధించారు. 2018 ఎన్నికల్లో సీపీఎం పార్టీ బీఎల్‌ఎఫ్‌ పేరుతో పోటీ దిగగా అభ్యర్థి డాక్టర్‌ కోట రాంబాబుకు 23,030 ఓట్లు వచ్చాయి. ఈ ఎన్నికల్లో బీఎల్‌ఎఫ్‌ మూడో స్థానంలో నిలిచింది.

ఐదుసార్లు విజయాలు..

మధిర నుంచి సీపీఎంకు రెండు ఉప ఎన్నికలు సహా ఐదు సార్లు విజయం దక్కింది. 1985(ఉప ఎన్నిక), 1989, 1994 ఎన్నికల్లో వరుసగా బోడెపుడి వెంకటేశ్వరరావు గెలిచారు. అలాగే, 1998 ఉప ఎన్నికతోపాటు 2004 సాధారణ ఎన్నికలో కట్టా వెంకటనర్సయ్య విజయం సాధించారు. ఆతర్వాత మాత్రం మళ్లీ సీపీఎంకు గెలువు దక్కలేదు.

ఈసారి పోటీకి సై..

ప్రస్తుత ఎన్నికల్లో సీపీఎం పోటీ చేస్తున్నట్లు ప్రకటించడం నియోజకవర్గంలో చర్చనీయాంశమైంది. పార్టీ అభ్యర్థిగా రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌ను ఖరారు చేశారు. దీంతో ఒకప్పుడు నియోజకవర్గంలో సత్తా చాటిన, సీపీఎం ఈసారి ఏ మేరకు ప్రభావితం చూవగలదనే విశ్లేషణలు ఇక్కడ మొదలయ్యాయి.

సీపీఎం అభ్యర్థుల బయోడేటా



- నియోజకవర్గం : మధిర
- పేరు : పాలడుగు భాస్కర్‌
- ప్రస్తుత హోదా : సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జాతీయ కార్యదర్శి
- విద్యార్హత : బీఏ
- తల్లిదండ్రులు : చిన్న వెంకయ్య, వెంకటమ్మ
- భార్యాపిల్లలు : సునీత – రాహుల్‌, సంహవి
- స్వస్థలం : మహబూబాబాద్‌ జిల్లా గార్ల
- రాజకీయ నేపథ్యం: 1999లో గార్ల పీఏసీఎస్‌ చైర్మన్‌గా ఎన్నిక. ఖమ్మం జిల్లా కేవీపీఎస్‌ వ్యవస్థాపక జిల్లా ప్రధాన కార్యదర్శి, 2007లో సీఐటీయూ అఖిలభారత కౌన్సిల్‌ సభ్యుడు. 2016లో ఆలిండియా వర్కింగ్‌ కమిటీ సభ్యుడిగా ఎన్నిక.
- పోరాటాలు : 2022లో షెడ్యూల్‌ పరిశ్రమల కార్మికులకు వేతనాలు పెంచకపోవడాన్ని నిరసిస్తూ 22 రోజులు పాటు 450 కిలోమీటర్ల పాదయాత్ర. 2023లో గ్రామపంచాయతీ కార్మికులను పర్మినెంట్‌ చేయడమే ఇతర సమస్యలు పరిష్కరించాలని 350 కి.మీ. మేర 17 రోజుల పాటు పాదయాత్ర. 2006లో కుల వివక్షత, అంటరానితనం వివక్షత... చివేతకు వ్యతిరేకంగా సీపీఎం ఉమ్మడి ఏపీ రాష్ట్ర కార్యదర్శి రాఘవులుతో కలిసి 13 రోజుల పాటు 205 గ్రామాల్లో సైకిల్‌ యాత్ర.



- నియోజకవర్గం : సత్తుపల్లి
- పేరు : మాచర్ల భారతి
- తల్లిదండ్రులు: మన్యం దేవానందం, నాగరత్నం భర్త మాచర్ల గోపాల్‌ (సీఐటీయూ నాయకుడు, సింగరేణి రిటైర్డ్‌ ఉద్యోగి)
- పిల్లలు : స్ఫూర్తి, సుమైత్రి
- స్వస్థలం : గార్ల, మహబూబాబాద్‌ జిల్లా (ప్రస్తుత నివాసం ఖమ్మం)
- రాజకీయ నేపథ్యం : ఇల్లెందు డివిజన్‌ పార్టీ కార్యదర్శి వర్గ సభ్యురాలిగా, ఐద్వా టౌన్‌, డివిజన్‌ కార్యదర్శిగా, పార్టీ ఇల్లెందు టౌన్‌ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తించారు. 2014 నుంచి ఖమ్మం ఐద్వా జిల్లా అధ్యక్షులుగా పనిచేశారు. ప్రస్తుతం ఐద్వా జిల్లా కార్యదర్శిగానే కాక కేంద్ర కమిటీ సభ్యురాలుగా కొనసాగుతున్నారు. అలాగే, పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యురాలిగా, జిల్లా పార్టీ సెక్రటేరియట్‌ సభ్యురాలిగా పనిచేస్తున్నారు.
- ఉద్యమాల్లో పాత్ర : 2000లో జరిగిన విద్యుత్‌ ఉద్యమంలో చురుకుగా పాల్గొన్నభారతి, 2006లో జరిగిన ఇళ్ల స్థలాల భూ పోరాటంలో ఐదు రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్షలో పాల్గొన్నారు. మహాప్రస్థానం పేరిట 13 రోజుల పాటు 300 కి.మీ. పాదయాత్రతో పాటు సామాజిక న్యాయం, సమగ్రాభివృద్ధి కోసం జరిగిన రాష్ట్ర వ్యాప్త మహాజన పాదయాత్రలో 15 రోజుల పాటు ఆమె పాల్గొన్నారు.



- నియోజకవర్గం : వైరా
- పేరు : భూక్యా వీరభద్రం
- స్వస్థలం : కస్నా తండా, ఖమ్మం రూరల్‌ మండలం
- తల్లిదండ్రులు : కమలమ్మ, సామ్యానాయక్‌
- కుటుంబం : భార్య విజయ, కుమార్తెలు సృజన, ఉషశ్రీ
- ప్రస్తుత నివాసం : వైరా
- విద్యార్హత : బీఏ
- రాజకీయ అనుభవం : 1999 నుండి 2002 వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఖమ్మం డివిజన్‌ కార్యదర్శిగా, సీపీఎం ఖమ్మం డివిజన్‌ కమిటీ సభ్యుడిగా పనిచేశారు. 2003 నుండి 2008 వరకు గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన ఆయన 2009 ఉండి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శిగా, రాష్ట్ర సహాయ కార్యదర్శిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం సీపీఎం జిల్లా కార్యదర్శిసభ్యుడిగా, పోడుభూముల పరిరక్షణ కమిటీ కన్వీనర్‌గానూ ఉన్నారు. గిరిజన సమస్యలపై జరిగిన అనేక ఉద్యమాల్లో వీరభద్రం చురుగ్గా పాల్గొన్నారు.

మాయ మాటలు నమ్మొద్దు..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

తల్లాడ: ఎన్నికల సమయంలో మాత్రమే ప్రజలు గుర్తుకుకొచ్చే నాయకుల మాయమాటల నమ్మొద్దని సత్తుపల్లి బీఆర్‌ఎస్‌ అభ్యర్థి సండ్ర వెంకటవీరయ్య అన్నారు. ఆదివారం తల్లాడ పట్టణంతో పాటు మల్లారం గ్రామంలో విస్తృతంగా పర్యటించారు. వాడ వాడలా తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షులు రెడ్డెం వీరమోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సభల్లో సండ్ర మాట్లాడుతూ.. గత 15 సంవత్సరాలుగా మీలో ఒక కార్యకర్తగా ఉంటూ నిత్యం ప్రజా సమస్యలపై పనిచేశానన్నారు. సీఎం కృషితో తల్లాడ పట్టణానికి రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. నవంబరు 30న జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో తల్లాడ ఎంపీపీ దొడ్డా శ్రీనివాసరావు, వైరా ఎఎంసీ వైస్‌ చైర్మన్‌ దూపాటి భద్రరాజు, రైతుబంధు మండల కన్వీనర్‌ వెంకట్‌లాల్‌, నాయకులు వెంకటేశ్వరరావు, ఆశీర్వాదం, శ్రీనివాసరెడ్డి, వీరకృష్ణ, జీవీఆర్‌, నాయుడు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, కోటారెడ్డి, ఈసూబ్‌, తిరుమలాదేవి, నరేష్‌రాజు, రాము, రాజశేఖర్‌రెడ్డి, రంగారావు, గురుస్వామి పాల్గొన్నారు.

అయ్యప్ప పడిపూజలో ఎమ్మెల్యే..

కల్లూరురూరల్‌: మండలంలోని సండ్రుపట్లలో 18వ సారి అయ్యప్ప మాల ధరించిన పైళ్ల రాధాకృష్ణ స్వామి ఆదివారం ఏర్పాటు చేసిన పడిపూజ కార్యక్రమంలో ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పాల్గొన్నారు. గురుస్వామి రాధాకృష్ణ నాయర్‌ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఎన్నికల్లో సండ్ర అత్యధిక మెజార్టీతో విజయం సాధించాలని అయ్యప్పలు దీవించారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్‌ కమిటీ వైస్‌ చైర్మన్‌ వెంకటేశ్వరరావు, సర్పంచ్‌ ప్రసాద్‌, రామకృష్ణ, అయ్యప్పలు పాల్గొన్నారు.

ఆశీర్వదించండి అభివృద్ధి చేస్తా: మదన్‌లాల్‌



ప్రచారంలో పాల్గొన్న మదన్‌లాల్‌, రాములు నాయక్‌

వైరా: ఎన్నికల్లో తనను ఆశీర్వదిస్తే అభివృద్ధి చేస్తానని వైరా బీఆర్‌ఎస్‌ అభ్యర్థి బానోత్‌ మదన్‌లాల్‌ అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని 1, 2, 3, 4, 20 వార్డుల్లో ఆయన ఎమ్మెల్యే రాములు నాయక్‌తో కలిసి ప్రచారం నిర్వంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్‌ సారథ్యంలో తెలంగాణ అభివృద్ధి జరిగిందన్నారు. అంతకు ముందు చర్చిల్లో ప్రార్థనలు చేసి, అంజనేయ స్వామి దేవాలయంలో పూజలు చేశారు. కార్యక్రమంలో మున్సిపాల్‌ వైస్‌ చైర్మన్‌ సీతారాములు, ఎఎంసీ చైర్మన్‌ మోహన్‌రావు, నాయకుల కట్ల కృష్ణార్జునరావు, కాపా మురళీకృష్ణ, రాంనారాయణ, ఎంపీపీ పావని, జెడ్పీటీసీ కనకదుర్గ, డాక్టర్‌ కోటయ్య, రవి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయండి



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌

వైరా: రాజకీయాలు వ్యాపారంగా మారిన ప్రస్తుత సమాజంలో చట్టసభల్లో కమ్యూనిస్టులకు ప్రాతినిధ్యం ఉండాలంటే ఓటర్లు ఆలోచించి ఓటు వేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌ అన్నారు. ఆదివారం సీపీఎం వైరా నియోజకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో, దేశంలో బీజేపీ పార్టీ బలపడకుండా ఉండేందుకు వామపక్ష పార్టీలు కృషి చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌ పార్టీ సీపీఎం రాష్ట్ర కమిటీ అడిగిన స్థానాలు ఇవ్వకపోవడంతో కాంగ్రెస్‌తో పొత్తు లేకుండా ఒంటరిగానే బరిలో నిలుస్తున్నామని తెలిపారు. ఈ నెల 10న సీపీఎం అభ్యర్థిగా భూక్యవీరభద్రం నామినేషన్‌ దాఖలు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఎం డివిజన్‌ కార్యదర్శి బొంతు రాంబాబు, జిల్లా కార్యదర్శి నాగేశ్వరరావు, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి కనకయ్య, సీపీఎం అభ్యర్థి వీరభద్రం, సుధాకర్‌, వీరభద్రరావు ఆయా మండలాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గుండెపోటుతో మాజీ జెడ్పీటీసీ మృతి



వెంకటేశ్వరరావు (ఫైల్‌)

వైరారూరల్‌: మండలంలోని కేజీ సిరిపురం గ్రామానికి చెందిన మాజీ జెడ్పీటీసీ తూము వెంకటేశ్వరరావు(71) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. వెంకటేశ్వరరావుకు గత నెల 27న గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రికి తరలించి ఆపరేషన్‌ చేయించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఆదివారం ఉదయం వెంకటేశ్వరరావు భౌతికాయాన్ని తన స్వగ్రామమైన కేజీ సిరిపురం తీసుకోచ్చారు. మార్క్‌ఫెడ్‌ మాజీ వైస్‌ చైర్మన్‌ బొర్రా రాజశేఖర్‌, కాంగ్రెస్‌ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌, బీఆర్‌ఎస్‌ అభ్యర్థి బానోత్‌ మదన్‌లాల్‌, మున్సిపల్‌ చైర్మన్‌ సూతకాని జైపాల్‌, బానోత్‌ విజయబాయి, కట్ల రంగారావు, గుమ్మా రోశయ్య, నాగు, వెంకటనర్సిరెడ్డి, మజ్జార్‌, దానియేలు, నరసింహారావు, వీరయ్య తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భౌతికాయానికి దహన సంస్కారాలు నిర్వహించారు.

లఘు చిత్రం విడుదల



లఘు చిత్రాన్ని విడుదల చేస్తున్న సూర్యవిక్రమాదిత్య

మధిర: ఖాజీపురం గ్రామానికి చెందిన యువ దర్శకుడు ఏఆర్‌ సమీర్‌ దర్శకత్వంలో రూపొందించిన 'బాబు గాడి జాబు'చిత్రాన్ని ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మల్లు సూర్య విక్రమాదిత్య విడుదల చేశారు. ఈ చిత్రాన్ని ఏబీసీ టాకీస్‌ అనే ఓటీటీ ద్వారా విడుదల చేసి చిత్ర బృందాన్ని అభినందించారు. ఈ చిత్రంలో యువనటులు ప్రవీణ్‌ చిన్నా, వెమలిశ్యామ్‌, గంగవరపు దేవా, మల్లన్న, దోర్నాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌ నుంచి కాంగ్రెస్‌లో చేరిక



పార్టీలో చేరిన వారితో పొంగులేటి, విజయాబాయి

కారేపల్లి: కాంగ్రెస్‌లోకి వలసల పర్వం కొనసాగుతూనే ఉంది. మండలంలోని గేటుకారేపల్లి బీఆర్‌ఎస్‌ గ్రామ శాఖ అధ్యక్షుడు సాయిని తిరుపతయ్యతో పాటు, సుమారు 100 కుటుంబాలు బీఆర్‌ఎస్‌ నుంచి మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, విజయాబాయి సమక్షంలో కాంగ్రెస్‌ పార్టీలో చేరారు. ఆదివారం ఖమ్మంలోని పొంగులేటి క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రతి కార్యకర్త కాంగ్రెస్‌ పార్టీ అధికారంలోకి వచ్చే విధంగా సైనికుల్లా పనిచేయాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారికి కాంగ్రెస్‌ కండువాలు కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌లో చేరిన వారిలో వెంకటేశ్వర్లు, నరసయ్య, తిరుమలరావు, సత్యనారాయణ, కుమార్‌, కబీర్‌, అప్పారావు, సాయి, ఆనందరావు, మోహన్‌రావు, నాగేశ్వరరావు, వీరభద్రం, ఆది, గోపీలు ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్‌ నాయకులు తిరుపతిరావు, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారంటీలే కాంగ్రెస్‌ను గెలిపిస్తాయి..



ముష్టికుంట్లలో ప్రచారం నిర్వహిస్తున్న మల్లు నందిని

బోనకల్‌: ఆరు గ్యారంటీ పథకాలే కాంగ్రెస్‌ పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయని సీఎల్పీనేత మల్లు భట్టి విక్రమార్క సతీమణి మల్లు నందిని అన్నారు. మండలంలోని ముష్టికుంట్ల, చొప్పకట్లపాలెం, చిరునోముల గ్రామాల్లో ఆదివారం రాత్రి ఆమె తనయుడు సూర్య విక్రమాదిత్యతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ శ్రేణుల ఆమెకు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. మధిర నియోజకవర్గ అభివృద్ధి భట్టి విక్రమార్కతోనే సాధ్యమని.. ప్రతి ఒక్కరూ భట్టికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. ప్రతిపక్షాలకు తగిన గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి బందం నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు గాలి దుర్గారావు, జెడ్పీటీసీ సుధీర్‌బాబు, కోటి, పిల్లలమర్రి నాగేశ్వరరావు, మైనార్టీ సెల్‌ మండల అధ్యక్షుడు షేక్‌ షాజహాన్‌, ఉపసర్పంచ్‌ సత్యనారాయణరెడ్డి, మురళి, వెంకటేశ్వర్లు, మహిళ మండల అధ్యక్షురాలు ప్రమీల, ముస్తాఫా, జానీమియా, వినయ్‌, చంటి పాల్గొన్నారు.

భట్టిని గెలిపించాలని ప్రచారం..



కాంగ్రెస్‌ కరపత్రాలు అందిస్తున్న నాయకులు

ఎర్రుపాలెం: కాంగ్రెస్‌ పార్టీ మధిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్కను భారీ మెజార్టీతో గెలిపించాలని కాంగ్రెస్‌ పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, మీడియా మండల కమిటీ ఇన్‌చార్జ్‌ మల్లెల లక్ష్మణరావులు కోరారు. ఆదివారం మండలకేంద్రంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు షేక్‌ ఇస్మాయిల్‌, కడియం శ్రీనివాసరావు, కంచర్ల వెంకటనర్సయ్య, దేవరకొండ శ్రీనివాసరావు, గుడేటి బాబురావు, దేవరకొండ రాజీవ్‌ గాంధీ, దేవరకొండ అనీల్‌కుమార్‌, సూరంశెట్టి రాజేష్‌, నండ్రు జనార్ధన్‌, తదితరులు ఉన్నారు.

మాదిగల యుద్ధభేరికి తరలిన నాయకులు



మాదిగల యుద్ధభేరికి తరలివెళ్తున్న ఎమ్మార్పీఎస్‌ నాయకులు

చింతకాని: మాదిగల యుద్ధభేరికి తెలంగాణ ఎమ్మార్పీఎస్‌ జాతీయ నాయకుడు లంకా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మండల ఎమ్మార్పీఎస్‌ నాయకులు ఆదివారం హైద్రాబాద్‌ తరలివెళ్లారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రానున్న అసెంబ్లీ, పార్లమెంట్‌ ఎన్నికల్లో మాదిగలకు సామాజిక న్యాయం కల్పించాలన్నారు. మాదిగల జనాభా తమాషా ప్రాతిపదికన కేటాయింపు జరగాలని తెలిపారు. రాజకీయ పార్టీలన్నీ మాదిగ డిక్లరేషన్‌ ప్రకటించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్‌ మండల అధ్యక్షుడు మాతంగి శ్రీను, మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఐదుగురిపై కేసు నమోదు

చింతకాని: మండలంలోని రామకృష్ణాపురం గ్రామంలో ఇంటి విషయంలో అత్తాకోడళ్ల మధ్య ఆదివారం వివాదం నెలకొంది. ఈ వివాదంలో అత్త నీలం సీతమ్మ, ఆడపడుచులు నాగమ్మ, రంగమ్మలపై కోడలు నీలం కొండమ్మతో పాటు మరో నలుగురు కలిసి దాడి చేశారు. ఈ దాడిలో సీతమ్మ, నాగమ్మ, రంగమ్మలు గాయపడ్డారు. బాధితుల ఫిర్యాదు మేరకు కోడలుతో పాటు మరో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజేందర్‌ తెలిపారు.



అటెన్షన్‌ ప్లీజ్‌

ప్రమాదకరంగా డివైడర్‌



తల్లాడ రింగ్‌రోడ్డు సెంటర్‌లో డివైడర్‌ ప్రమాదకరంగా ఉంది. కొత్తగూడెం రోడ్డు వైపు ఉన్న ఈ డివైడర్‌ను ఇటీవల వాహనం ఢీ కొట్టింది. దీంతో డివైడర్‌ పడిపోయి దాని గ్రిల్స్‌ బయటకు పొడుచుకొచ్చాయి. ఇనుప గ్రిల్స్‌ బయటకు పొడుచుకొని ప్రమాదకరంగా ఉన్నాయి. ఏదైనా వాహనం అదుపు తప్పి డివైడర్‌ కెళ్ల వెళ్లినా, లేదా చీకట్లో ఎవరైనా పాదాచారులు వెళ్లినా ఇనుప కడ్డీలు కచ్చుకొనే ప్రమాదం పొంచి ఉంది. రింగ్‌రోడ్డు సెంటర్‌లో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. నిత్యం రద్దీగా ఉండే ఇలాంటి చోట కూడా గ్రిల్స్‌ బయటకు వచ్చి డివైడర్‌ పడిపోయినా పట్టించుకోకపోవటంతో ప్రయాణికులు విస్తు పోతున్నారు.

– తల్లాడ

ప్రశ్నించాల్సిన అధికారి : పవన్‌, ఆర్‌అండ్‌బీ ఏఈ, వైరా
సెల్‌ నంబర్‌ : 7660805013